ఖమ్మం జడ్పీ సెంటర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వర్‌రావు, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట హోటల్ వద్ద కేసీఆర్‌తో సెల్ఫీ తీసుకుంటున్న గ్రామస్థుడు

కదంతొక్కిన ఖ(గు)మ్మం

- ఉద్యమ సారథికి ఖమ్మంలో అఖండ స్వాగతం
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన గులాబీ దళపతి
- అశేషవాహినితో జడ్పీ సెంటర్ ప్రాంతం జనసంద్రం
- కేసీఆర్‌ను చూడగానే సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు
- ప్రసంగం మధ్యలో 'రైతుబంధు రావట్లే'దంటూ మొర

ఖమ్మం, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం జిల్లా కదం తొక్కింది. ఉద్యమ సారథి, గులాబీ దళపతి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అడుగడుగునా అపూర్వ స్వాగతం పలికింది. బస్సుయాత్రలో భాగంగా సోమవారం రాత్రి చేరుకున్న బీఆర్ఎస్ అధినేతకు జిల్లా జనం నీరాజనం పలికింది. జిల్లా సరిహద్దు గ్రామమైన తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం నుంచి అశేష జనవాహిని ఎదురేగి వచ్చి ఆయనను అనుసరించింది. యాత్ర ఖమ్మం నగరంలోకి ప్రవేశించగానే ప్రవాహంలా జనం తరలివచ్చారు. కిలోమీటర్ల పొడవున పార్టీ శ్రేణులు, అభిమానులు తమ అధినేతకు అద్భుత స్వాగతం పలికేందుకు పోటీపడ్డారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా మార్గాల వద్ద వేచి ఉన్నారు. కేసీఆర్‌ను కనులారా చూసేందుకు మధ్యాహ్నం 3 గంటల నుంచే వరంగల్ క్రాస్‌రోడ్డు, కాల్వొడ్డు, నయాబజార్, మయూరి సెంటర్, పాత బస్టాండ్ సెంటర్, పాత ఎల్‌ఐసీ ఏరియా, జడ్పీ సెంటర్ ప్రాంతాల్లో వరుసగట్టారు. ఇసుకేస్తే రాలనంత జనం తమ కేసీఆర్ కోసం ఎదురుచూశారు.

కాల్వొడ్డు వద్ద ఘనస్వాగతం

కాల్వొడ్డు వద్ద పార్టీ అధినేతను బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, హరిప్రియ, మదన్‌లాల్, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఘనస్వాగతం పలికారు. మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం రూరల్ ఎంపీపీ బెల్లం ఉమ హారతులు పట్టారు. వరంగల్ క్రాస్‌రోడ్డు నుంచి జడ్పీ సెంటర్ వరకు అధినేత బస్సును కార్యకర్తలు, అభిమానులు అనుసరించారు. 'జై కేసీఆర్..' అంటూ నినదించారు. ఈ క్రమంలో బస్సులోంచి అభివాదం చేస్తూ కేసీఆర్ ముందుకు కదిలారు.

రాలేదు.. అందలేదు..

'కాంగ్రెస్ పాలనలో తులం బంగారం, కల్యాణలక్ష్మి వస్తుందా? రైతుబంధు అందరికీ అందిందా? మహిళలకు రూ.2,500 వచ్చాయా?' అంటూ వేదికపై నుంచి కేసీఆర్ ప్రశ్నించగా, 'రాలేదు.. అందలేదు' అని చెబుతూ ప్రజలు పెద్ద ఎత్తున చేతులు పైకెత్తి చెప్పారు. ఉద్యమ సమయంలో ఖమ్మం తనను ఆదరించిందని, ఆమరణ దీక్షకు పూనుకున్న తనను ఖమ్మం జైల్లో వేస్తే ఇక్కడి రాజకీయ పక్షాలు, ఉద్యమకారులు తనను కంటికి రెప్పలా కాపాడుకున్నారని కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గడిచిన పదేండ్లలో జిల్లాలో అభివృద్ధిని, బీఆర్ఎస్ ముందుచూపును గుర్తుచేశారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచి తీరుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో కేసీఆర్ బస్సుయాత్ర తొలి రోజు ఐదు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ యాత్ర పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. పార్టీ అధినేత కేసీఆర్‌ను చూసేందుకు, ఆయన ప్రసంగాన్ని ఆసాంతం వినేందుకు తరలివస్తున్న పార్టీ శ్రేణులకు పోలీసుల నుంచి ఇబ్బందులు తప్పలేదు. అనేక చోట్ల రహదారులకు అడ్డంగా బారికేడ్లు, వాహనాలు అడ్డుపెట్టారు. ప్రధాన రహదారులపైకి పార్టీ శ్రేణులు రాకుండా అడ్డుకున్నారు.

ఖమ్మం నగరం.. గులాబీమయం

కేసీఆర్ రాకతో ఖమ్మం నగరం గులాబీమయమైంది. పిల్లలు, వృద్ధులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చారు. 'మా బాపూ కేసీఆర్..' అంటూ నినదించారు. దాదాపు గంటన్నరపాటు జిల్లా కేంద్రంలో కేసీఆర్ బస్సుయాత్ర కొనసాగింది. సుమారు అరగంటపాటు ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీజేపీ చర్యలను తన ప్రసంగంలో తూర్పారబట్టారు. ఈ క్రమంలో ఆయన ప్రసంగానికి అనూహ్య స్పందన లభించింది. బస్సుపై భాగానికి కేసీఆర్ చేరుకోగానే.. 'సీఎం.. సీఎం..' అన్న నినాదాలు హోరెత్తాయి. కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో తమకు రైతుబంధు రావడం లేదంటూ రైతులు ఏకరువు పెట్టారు. ఇందుకు ఆయన ప్రతిస్పందించారు. ఖమ్మం జిల్లా ప్రజలు చైతన్యవంతులని గుర్తు చేస్తూ కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. బీజేపీ ప్రభుత్వం పనైపోయిందని, కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించుకుంటే కేంద్ర మంత్రి అవుతారని కేసీఆర్ చెప్పారు. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు ప్రకటించారు. నామా ప్రజల మనిషని, ప్రజల కోసం ఏదైనా చేయాలనే ఆరాటం ఆయనకు ఉంటుందని అన్నారు.

జననేతకు అడుగడుగునా జనహారతి

- 120 కిలోమీటర్లు.. మూడు గంటలు
- పలుకరిస్తూ.. ప్రజలతో మమేకమవుతూ..
- బస్సు యాత్ర తోవలో ఆగుతూ సాగిన కేసీఆర్
- కేసీఆరే రావాలి.. సీఎం కావాలంటూ నినాదాలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): వరంగల్ నుంచి ఖమ్మం వరకు 120 కిలోమీటర్లు.. 8 అసెంబ్లీ నియోజకవర్గాలు.. సోమవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సుయాత్ర సాగింది. జననేత రాకను చూసి ఊరూరా ప్రజలు పులకించిపోయారు. అక్కడక్కడా ఆగి ప్రజలను పలుకరిస్తూ, వారితో మేమకమవుతూ కేసీఆర్ ముందుకు సాగడంతో జనం ఆనందతాండవం చేశారు. వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, పాలకుర్తి, మహబూబాబాద్, డోర్నకల్, పాలేరు, ఖమ్మం అసెంబ్లీ నియోజవకర్గాల పరిధిలోని గ్రామాలను తాకుతూ ఉన్న జాతీయ రహదారి గుండా రోజంతా కోలాహలం నెలకొన్నది. హన్మకొండలోని మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంటి నుంచి సాయంత్రం 4.45 గంటలకు కేసీఆర్ బయలుదేరారు. ఖమ్మం పట్టణం చేరుకోవడానికి మూడు గంటల సమయం పట్టింది. వర్ధన్నపేట నియోజకవర్గం కేంద్రం నుంచి ఖమ్మం జిల్లా కేంద్రానికి చేరేదాకా కేసీఆర్‌కు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. కేసీఆర్ బస్సుపై పూలవాన కురిపించారు. ప్రజలు రోడ్డు మీదికి వచ్చి 'జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ స్వాగతం పలికారు.

ఇసుకేస్తే రాలనంత జనం

హన్మకొండ నుంచి ఖమ్మం దాకా కేసీఆర్ వస్తున్నారని సమీప గ్రామాలు, ఆవాసాల నుంచి వచ్చిన జనం రోడ్డుకు ఇరువైపులా నిలబడి జై కేసీఆర్ అంటూ నినదించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. వర్ధన్నపేట, తొర్రూరు, మరిపెడ పట్టణాల్లో కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సు ముందు ఇసుకేస్తె రాలనంత జనం రోడ్డుకు ఇరువైపులా చేరారు. వారి వద్దకు బస్సు రాగానే పూలవాన కురిసిందా అన్నట్టుగా కేసీఆర్‌పై పూలు చల్లారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని తొర్రూరులో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభిమానాలు పెద్ద ఎత్తున కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. మరిపెడలో మహబూబాబాద్ ఎంపీ, ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ కేసీఆర్‌కు మంగళహారతులతో స్వాగతం పలికారు.

వర్ధన్నపేటలో అపూర్వస్వాగతం

నియోజకవర్గ కేంద్రమైన వర్ధన్నపేట కేసీఆర్‌కు అపూర్వస్వాగతం పలికింది. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ రెండుసార్లు ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. గత ఎన్నికల్లో ఓడిన ఆయన ప్రస్తుతం వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. మరోవైపు ఇదే నియోజకవర్గంలోని పర్వతగిరి గ్రామస్థుడైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య ఈ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లిన ఇద్దరు నేతలకు చెందిన వర్ధన్నపేట నియోజకవర్గంలో ఐనవోలు క్రాస్ దగ్గర, వర్ధన్నపేట పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో చేరి కేసీఆర్‌కు అపూర్వ స్వాగతం పలికారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుది సైతం ఇదే నియోకవర్గం కావడం మరో విశేషం.

ఖమ్మం పొలిమేరల్లో ఘనస్వాగతం

ఖమ్మం పొలిమేరల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికాయి. తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం నుంచి ఖమ్మం పట్టణం దాకా డప్పు చప్పుళ్లు, బోనాలు, బతుకమ్మలు, వివిధ వేషధారణలతో ఖమ్మం ప్రజలు, శ్రేణులు అపూర్వస్వాగతం పలికారు.

ఎల్లంపేట క్రాస్ రోడ్ వద్ద ఆగిన కేసీఆర్

వరంగల్– ఖమ్మం జాతీయ రహదారిలోని ఎల్లంపేట క్రాస్‌రోడ్డు పెద్ద జంక్షన్ కూడా కాదు. రోడ్డుకు ఇరువైపులా పట్టుమని ఇరవై ఇండ్లు కూడా లేవు. డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలంలోని ఎల్లంపేట క్రాస్ రోడ్డు సోమవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆకట్టుకున్నది. చాయ్, బజ్జీలు, గారెలు దొరికే హోటల్. కేసీఆర్ కాన్వాయ్ ఆ హోటల్ ముందు ఆగడంతో దాని యజమాని సొంద్ సంబురానికి పట్ట పగ్గాల్లేవు.

సార్ ఆగుతడని అనుకోలేదు : సోంద్

'కార్లు రయ్‌రయ్‌మని పోతున్నాయి. 'ఈ రోజు కేసీఆర్ ఇట్లనే పోతడని అనంగ ఇన్న. నేను కడాయిల (మూకుడు) మిర్చీ ఏస్తున్న. పది ఇరవై కార్లు ముందుపోయినవి. తరువాత బస్సు. హోటల్ ముందుకు రాంగనే సార్ బస్సాపిండు. హోటల్ దగ్గరికి వచ్చిండు. పార్టీ వాళ్లందరినీ పక్కకు పోమ్మని చెప్పిండు. నా దగ్గరికి వచ్చి.. నీ పేరేంది అని అడిగిండు. సోంద్ సార్ అని చెప్పిన. నెలకు ఎంత సంపాదిస్తున్నవు అని అడిగిండు. ఆరేడు వేలు వస్తయి అని చెప్పిన. చాయ్ ఇస్తవా.. కాఫీ ఇస్తవా అన్నడు. ముందు మిర్చీలు ఇయ్యమని చెప్పిండు. రైతుబంధు వచ్చిందా అంటే రొండెకరాలున్న రైతుకు కూడా కాలేదని ఒకాయిన చెప్పిండు. రుణమాఫీ లేదు ఏం లేదు. రైతులు ఆగమైతాండ్లు అని ఓ ముసలాయిన సార్‌తోని ముచ్చటబెట్టిండు. కాఫీ ఇయ్యంగనే తాగిండు. సార్‌తోని దయాకర్‌రావు సార్ ఇంకా ఇద్దరు ముగ్గురున్నరు. వాళ్లకు కూడా కేసీఆర్ సారే తాగమని చెప్పిండు. అయిపోంగనే లేచి రూ.500 ఇచ్చిండు. కేసీఆర్ సార్ పది నిమిషాలు మా దగ్గర ఉన్నడు.

చేతులెత్తేసిన పోలీసులు

హన్మకొండ నుంచి ఖమ్మం బయలుదేరిన కేసీఆర్ బస్సు యాత్ర సందర్భంగా పోలీసులు అడుగడుగునా చేతులెత్తేసినట్టు వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసీఆర్ బస్సు దగ్గరికి జనం పరుగులు పెట్టి వస్తుంటే వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ దూషణలకు దిగిన ఘటనలు చోటుచేసుకున్నాయి. తొర్రూరు పట్టణంలో కేసీఆర్ బస్సుకు ముందు ఉన్న కాన్వాయ్‌లోని భద్రతా కార్లు వెళ్లిపోయాక అటు నుంచి ఆర్టీసీ బస్సు వస్తున్నా అక్కడే ఉన్న పోలీసులు కనీసం దానిని ఆపే ప్రయత్నం చేయకపోవడం దారుణమని బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జనం కోసం కేసీఆర్ ఆగారని, అదే సమయంలో రోడ్డుపై ఎదురుగా బస్సు వస్తున్నా పోలీసులు పట్టిచ్చుకోకపోవడంతో ప్రభుత్వం ఏం సంకేతం ఇస్తుందని పార్టీ శ్రేణులు మండిపడుతున్నారు.

ఎల్లంపేట స్టేజీ తండా వద్ద పులకించిన జనం

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చూసిన మహబూబాబాద్ ప్రాంత ప్రజలు పులకించిపోయారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ తండా, మరిపెడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు కేసీఆర్ వస్తున్నారని తెలిసి అక్కడకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఎల్లంపేట స్టేజీ తండా వద్ద సర్పంచ్ లాల్‌సింగ్ సహా రైతులు తమకు రైతుబంధు రావడం లేదని, రుణమాఫీ కాలేదని, నీళ్లందక పొలాలు ఎండిపోయినాయని కరెంటు రావట్లేదని కేసీఆర్ వద్ద తమ బాధను వ్యక్తం చేశారు.

కేసీఆర్‌కు గోడు వెళ్లబోసుకున్న మహిళారైతు

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ వద్ద హోటల్‌లో టీ తాగి వెళ్తున్న కేసీఆర్‌కు మహిళా రైతు గుగులోత్ జ్యోతి తన గోడు వెళ్లబోసుకున్నది.

గుగులోత్ జ్యోతి: సార్ నమస్కారం

కేసీఆర్: నమస్కారం చెప్పమ్మా

జ్యోతి: సార్ నా పొలం పట్టా కాలేదు సార్

కేసీఆర్: ఎన్ని ఎకరాలు

జ్యోతి: మూడెకరాలు. యాసంగి రెండెకరాలు పొలం చేస్తే నీళ్లు రాక ఎకరం ఎండింది.

కేసీఆర్: ఎస్సారెస్పీ నీరు రాలేదా?

జ్యోతి: వారం తప్ప వారం నీళ్లు వదిలినారు సార్. మార్చి మధ్యనే నీళ్లు ఆపడంతో ఎకరం ఎండిపోయింది సార్

కేసీఆర్: మంచి రోజులు వస్తాయి. ఈ ఎన్నికల్లో ఓటు వేసి వాళ్లకు బుద్ధి చెప్పాలి.

జ్యోతి: పట్టా కాకపోవడానికి కారణంపై ఫోన్ నంబర్ తీసుకున్నారు. తర్వాత సార్ పీఏ భూమి వివరాలు తీసుకున్నారు.

అతి పెద్ద పార్టీగా బీఆర్ఎస్

- 13-14 ఎంపీ సీట్లు గెలుచుకుందాం
- న్యూస్ 24 సర్వేపై కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ధీమా వ్యక్తంచేశారు. న్యూస్ 24 చానల్ విడుదల చేసిన లోక్‌సభ ఎన్నికల సర్వే ఫలితాలను సోమవారం ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఎనిమిది సీట్లు వస్తాయని న్యూస్ 24 అంచనా వేసింది. అంచనా వేసిన నేపథ్యంలో 13 నుంచి 14 ఎంపీ సీట్లు గెలుచుకునేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'బడా భాయ్ మోదీ.. చోటా భాయ్ రేవంత్' మధ్య తెలంగాణలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ 8 స్థానాలు, కాంగ్రెస్ 2, బీజేపీ 6, ఎంఐఎం 1 ఒక స్థానం గెలుచుకుంటాయని న్యూస్ 24 అంచనా వేసింది.

కేంద్ర సహకారంతోనే ప్రజ్వల్ రేవణ్ణ పరార్

- అతన్ని దేశానికి రప్పించి శిక్షించాలి
- మహిళల పట్ల బీజేపీది నిర్లక్ష్య ధోరణి
- రాజ్‌దీప్ సర్దేశాయ్ ట్వీట్‌కు కేటీఆర్ స్పందన

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): మహిళలను లైంగికంగా వేధించిన కర్ణాటక ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు కేంద్ర ప్రభుత్వ సహకారం ఉన్నదని, అందుకే ఆయన సులువుగా దేశం నుంచి పారిపోగలిగాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపులపై ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ చేసిన ట్వీట్‌కు కేటీఆర్ సోమవారం స్పందించారు. మహిళల పట్ల మోదీ సర్కారు అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. 'మహిళలపై ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న వార్తలు నన్ను దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఆయన దేశం విడిచి ఎలా పారిపోగలిగాడు? ప్రజ్వల్ రేవణ్ణ తప్పించుకోవటంలో కేంద్ర ప్రభుత్వ సహకారం ఉన్నది. ఒకవేళ కేంద్ర సహకారం లేనట్టయితే ఆయనను దేశానికి తిరిగి తీసుకొచ్చి చట్ట ప్రకారం శిక్షించాలి. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న వేధింపులను మోదీ సర్కారు పట్టించుకోవటం లేదు. బిల్కిస్ బానో రేపిస్టులను విడుదల చేశారు. బ్రిజ్ భూషణ్ సింగ్‌పై మహిళా రెజర్లు చేసిన ఆరోపణలను పట్టించుకోలేదు. ఇప్పుడు మరో సంఘటన. మహిళలపై లైంగిక వేధింపుల విషయంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరి నన్ను ఆశ్చర్యానికి గురిచేస్తోంది' అంటూ కేటీఆర్ రీట్వీట్ చేశారు.

దళిత జాతికి వెలకట్టి!

మొదటిపేజీ తరువాయి...

కుటుంబాల పట్ల ఇది అపచారమన్నది తగిన మాటేమో! మానకొండూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు ప్రకాశ్ సోమవారం దుర్మార్గంగా మాట్లాడారు. యావత్తు దళిత జాతిని దళిత సోదరులను అవమానించే వ్యాఖ్యలు చేశారు. దళితులకు ఓటును అమ్ముకుంటారనే అపఖ్యాతి ఉన్నదని చెప్తూ ఆయన దళిత సమాజం గురించి అనరాని మాటలు అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ దళితుల సమావేశానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉండగా.. ఆయన జమ్మికుంటలో సీఎం ప్రో గ్రాం ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. దీంతో ఆయన సోదరుడు కవ్వంపల్లి ప్రకాశ్ దళితుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భం గా అక్కడున్న నాయకులు ఆయనను మాట్లాడాలని కోరారు. మైక్ తీసుకున్న ప్రకాశ్... 'స్టేజ్‌పైన మాట్లాడే అవకాశం నాకెప్పుడూ రాలేదు. చాలా తక్కువసార్లు మాట్లాడాను' అంటూ మొదలుపెట్టిన ప్రకాశ్.. తర్వాత ఘోరంగా మాట్లాడారు. 'అమ్ముడుపోయే జాతి అని చెప్పేసి, మనపై ఒక ముద్ర ఉన్నది. వెయ్యి రూపాయలకు ఓటు అమ్ముకుంటరు. ఇంకో సున్నా కలిపితే ఇంకోటి అమ్ముకుంటరు. ఇంకో సున్నా కలిపితే ఇంకోటి అమ్ముకుంటరు. ఇంకో సున్నా కలిపితే ఇంటి ఇల్లాలిని కూడా అమ్ముకుంటరు అనే అపప్రథ మన మీద ఉన్నది' అంటూ అభ్యంతరకరంగా మాట్లాడారు. (దళిత జాతి గురించి దళిత సహోదరుల గురించి ప్రకాశ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వేయడానికి మనసొప్పని పరిస్థితి. వీటిని ప్రచురించాలా? వద్దా? అన్నదానిపై 'నమస్తే తెలంగాణ' పత్రిక ఎడిటోరియల్ బోర్డులో సుదీర్ఘ చర్చ జరిగింది. అధికారంలోకి వచ్చిన తర్వాత గత నాలుగు నెలలుగా వివిధ స్థాయిల కాంగ్రెస్ నేతలు సమాజంలోని వివిధ వర్గాలపై విషం చిమ్మే వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల ధోరణిని దళిత సోదరులు, సమాజం దృష్టికి తేవటం కోసం, ఇబ్బందికరమే అయినా ఈ వ్యాఖ్యల్ని ప్రచురించాలని నిర్ణయం తీసుకోవడమైంది) ప్రకాశ్ మాటలు విన్న సభలోనే ఉన్న దళిత సోదరులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఓటు ను అమ్ముకోకుండా సద్వినియోగం చేసుకోవాలని చెప్పడానికి ఇలాంటి మాటలు మాట్లాడాల్సిన అవసరం ఉన్నదా? అని విస్తుపోయా రు. ఏ సభకు వచ్చారు? ఎవరి గురించి ఏం మాట్లాడుతున్నారు? అని వారు ఆగ్రహంగా చర్చించుకున్నారు. దళిత సామాజికవర్గానికే చెందిన నాయకుడే ఇలా దళితజాతిని కించపరిచే రీతిలో మాట్లాడటం ఏమిటని ఆవేదన చెందారు. దళిత నాయకులే తమ జాతి గురించి ఇలా నిందాపూర్వకంగా మాట్లాడితే, ఇక మిగతా వారి గురించి చెప్పేదేముందని ఆక్రోశించారు. 'అయినా ఓట్లకు డబ్బులు తీసుకోవాలా? వద్దా? అనేది వ్యక్తిగత వ్యవహారం. అది కులాన్ని బట్టి ఉంటుందా? సమాజంలో ఒక్క దళితులే ఓట్లు అమ్ముకుంటున్నారా? మిగతా కులాల వారంతా పత్తిత్తులా? అట్లైతే మరి ఎన్నికలకు రాజకీయ పార్టీలకు ఇంత ఖర్చు ఎందుకవుతున్నది? కులం ఆధారంగా ఇలా ముద్ర వేయడం ఎంతమాత్రం సరి కాదు' అని ఒక దళిత యువకుడు ఆగ్రహం వ్యక్తం చేసారు. 'ఓట్లు అమ్ముకుంటున్నారని మమ్మల్ని తప్పుబడుతున్నారు. మరి కొనుక్కుంటున్నవాళ్ల సంగతేమిటి? ఇవాళ మాట్లాడుతున్నవాళ్లు ఎన్నికల్లో ఖర్చు పెట్టుకోకుండా, ఓట్లు కొనుక్కోకుండానే గెలిచారా? మరి వాళ్లనేమనాలి' అని మరో నడివయస్కుడు దునుమాడారు. ప్రకాశ్ మాట్లాడిన మాటలు అటు సోషల్ మీడియాలోనూ వైరల్ అయ్యాయి. దళిత సమాజంలో పెనుచర్చకు దారితీశాయి. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ నాయకులు రైతుల మీద, బీసీల మీద, నేతన్నల మీద నోటికొచ్చినట్టు మాట్లాడారని, ఇప్పుడు దళితుల వంతు వచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

మాదిగలు కాంగ్రెస్‌కు ఓటెయ్యొద్దు

- ఈ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వరా!
- రాష్ట్రంలో మాదిగలను బొంద పెట్టేందుకు రేవంత్‌రెడ్డి కుట్ర
- కాంగ్రెస్‌కు 14 సీట్లు వస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతన్న మోత్కుపల్లి నరసింహులు. చిత్రంలో ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ

రవీంద్రభారతి, ఏప్రిల్ 29: రాష్ట్రంలో మాదిగలకు ఒక్క లోక్‌సభ సీటు ఇవ్వకుండా అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీని ఓడించాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు పిలుపునిచ్చారు. మాదిగలెవరూ కాంగ్రెస్‌కు పార్టీకి ఓటేయవద్దని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 14 ఎంపీ సీట్లు వస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో మాదిగ జాతిని బొంద పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రం లో 80 లక్షల జనాభా ఉన్న మాదిగలకు ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా ఎందుకు ఇవ్వలేదో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకే కుటుంబానికి మూడు సీట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. 'అన్ని సీట్లు మీ కులానికే ఇచ్చుకుంటే.. మిగతా జాతులు ఏం కావాలి? పార్టీ అధిష్ఠానం మిగతా కులాలకు ఇవ్వద్దని చెప్పిందా? ప్రజలకు చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

వర్గీకరణ బిల్లుపై ఎవరు మాట్లాడుతారు?

'రేపు పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు వస్తే మాదిగవాడు ఉండవద్దా? ఇది ఏ రకంగా సహించాలి. వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లోకి రాకుండా రేవంత్‌రెడ్డి భారీ కుట్రకు ప్లాన్ చేస్తున్నారు' అంటూ మోత్కుపల్లి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు అద్దంకి దయాకర్, బెల్లయ్య నాయక్‌కు సీటు ఇవ్వకుండా, బీఆర్ఎస్‌ను మోసం చేసి వచ్చిన కడియం శ్రీహరి బిడ్డ కడియం కావ్యకు వరంగల్ సీటు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామని, యావత్ మాదిగ జాతి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు. మే 4న ఇందిరాపార్క్ లేదా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద భారీ ధర్నా, నిరసన ప్రదర్శనలు చేస్తామని మాదిగలంతా లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ ఎదుగుదలకు మాదిగలే ప్రధానపాత్ర పోషించారని స్వయంగా ఆయనే చెప్పారని గుర్తుచేశారు. రాష్ట్రంలోని మూడు రిజర్వుడ్ స్థానాలలో ఒక్కటి కూడా మాదిగలకు ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ చేసిన ద్రోహంపై రాష్ట్రమంతా యాత్రలు నిర్వహిస్తామని చెప్పారు.

కడియం శ్రీహరి ఎస్సీనే కాదు.. ఆయన బిడ్డ ఎలా అవుతుంది?

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 29: 'కడియం శ్రీహరి ఎస్సీనే కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ రోజుల్లోనే చెప్పాడు. ఇప్ప